క్లుప్తంగా

అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులుగావించి వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజా కార్యక్రమాల్లో ఈఓ ఎస్ లవన్న, అర్చకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



విద్యార్థులచే పుస్తక పఠనం చేయిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని లైబ్రేరియన్ కౌసల్య అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో చదవడం మా కిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. విద్యార్థులతో స్వాతంత్ర్య సమరయోధుల జీవితచరిత్ర పుస్తకాలు, నీతికథల పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్ వంటి ఇతర పుస్తకాలను చదివించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞానానికి మూలలు అన్నారు. విద్యార్థిని, విద్యార్థులు, యువతీయవకులు, నిరుద్యోగులు, కంపీటిషన్ పరీక్షలు రాసేవారు గ్రంథాలయాల్లో దొరికే పుస్తకాలను వినియోగించుకొని ఉన్నతశిఖరాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు.

పందుల బెడద నుంచి పంటలను కాపాడండి



పందులు నాశనం చేసిన మొక్కజొన్న పంట

జూపాడుబంగ్లా: పందుల బెడద నుంచి పంటలను కాపాడాలని రైతులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం జూపాడుబంగ్లా, తంగడంచ గ్రామాలకు చెందిన రైతులు జయప్రకాశ్, చిన్న, పి.వెంకటేశ్వర్లు, మల్లికార్జున, బాలరాజు, ఎం.వెంకటస్వామి తో పాటు మరి కొంత మంది రైతులు జూపాడుబంగ్లా పోలీసు స్టేషన్‌లో లిఖితపూర్వకంగా వారి ఆవేదనను తెలియజేశారు. జూపాడుబంగ్లా గ్రామానికి చెందిన కొంత మంది పందుల పెంపకందారులు వాటిని యథేచ్ఛగా వదిలిపెడుతున్నారని, అవికాస్త గ్రామానికి సమీపంలో ఉన్న పంటపొలాలపై దాడిచేసి నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నారమన్నారు. పోలీసులు చొరవ తీసుకొని పందుల యజమానులపై చర్యలు తీసుకొని, అవి పంటల పొలాల వైపు రాకుండా చేయాలని కోరారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం



దాతకు లడ్డూప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన ఎస్.వెంకటరమణ రూ.1,00,001 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని విరాళాల కేంద్రంలోని అధికారులకు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, విరాళానికి సంబంధించిన బాండును అందజేశారు.

ప్రభుత్వ వైద్యశాల తనిఖీ



ప్రభుత్వ వైద్యశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న డీడీ రామ్‌నాథ్‌రావు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను ఆదివారం డిప్యూటీ డైరెక్టర్ రామ్‌నాథ్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో అభివృద్ధి పనులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా, సిబ్బంది కొరత ఏమైనా ఉందా, డాక్టర్లు సక్రమంగా వస్తున్నారాలేదా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మలేరియా, ఫైలేరియా కేసుల వివరాలు అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వెంకటరమణ, లక్ష్మీప్రసన్న, ఓబులేసు, నాగరాజు, పవన్‌కుమార్, సాయికుమార్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు ప్రథమ భక్తురాలు

‘హేమారెడ్డి మల్లమ్మ’

- మల్లన్న వరంతో.. మల్లమ్మ కంటిలో ఆనందభాష్పాలు
- 365 రోజులు నిరంతరం నీటి ఊట.. ఆ జలమే భక్తులకు తీర్థం
- మల్లమ్మ కన్నీరు ఆలయానికి పోటెత్తిన కన్నడ భక్తులు



మల్లమ్మ దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లలో వెళ్తున్న కన్నడ భక్తులు



శ్రీశైలంలోని హేమారెడ్డి మల్లమ్మ కన్నీరు ఆలయం,(ఇన్‌సెట్) ప్రత్యేకాలంకరణలో హేమారెడ్డి మల్లమ్మ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీమల్లికార్జున స్వామికి ప్రథమ భక్తురాలు హేమారెడ్డి మల్లమ్మ. కర్ణాటక ప్రాంతానికి చెందిన కొండవీటి రాజవంశస్తురాలైన మల్లమ్మకు చిన్ననాటి నుంచే మల్లన్నపై భక్తి ఎక్కువ. ఆమె భక్తిని మెచ్చిన స్వామి వరం ఇవ్వడంతో సంతోషంలో మల్లమ్మ కంటి నుంచి ఆనందభాష్పాలు రాలాయి. ఈ ఆనందభాష్పాలు 365రోజులు నిరంతరం నీటి ఊట వలె ప్రవహిస్తున్నాయి. ఈ నీటినే మల్లమ్మకన్నీరు అంటారు. వీటినే క్షేత్రాన్ని సందర్శించిన భక్తులకు తీర్థ ప్రసాదంగా అందిస్తున్నారు.

మల్లమ్మ చిన్నతనం నుంచే స్వామి భక్తురాలు

శ్రీశైల మహాక్షేత్రంలో హేమారెడ్డి మల్లమ్మకన్నీరు ఆలయం ఒకటి. ఆలయం వెనుకభాగంలో ఈ ఆలయం ఉంది. కర్ణాటక రెడ్డిసంఘం వారు ఈ ఆలయాన్ని నిర్మించారు. కర్ణాటక ప్రాంతానికి చెందిన కొండవీటి రాజవంశస్తులైన హేమారెడ్డి మల్లమ్మ చిన్నతనం నుంచే మల్లికార్జున స్వామి భక్తురాలు. ఆమె మల్లన్నపై భక్తితో శ్రీశైలం వచ్చి స్వామి కోసం తపస్సు చేస్తుంది. ఆమె భక్తిని పరీక్షించేందుకు మల్లికార్జున స్వామి ఆమెకు పలు కష్టాలు కలిగేలా చేస్తాడు. కష్టాలన్నింటినీ ఓర్చుకుంటుంది. ఎన్ని కష్టాలు వచ్చినా మల్లన్నపై భక్తి మాత్రం తగ్గలేదు. దీంతో మల్లికార్జున స్వామి ప్రత్యక్షమై వరం అందిస్తాడు. పరమేశ్వరుడే స్వయంగా తన భక్తికి మెచ్చి ప్రత్యక్షమై వరం అందించడంతో సంతోషంలో హేమారెడ్డి మల్లమ్మ కంటి నుంచి ఆనందతో కన్నీళ్లు రాలుతాయి. ఈ ఆనందభాష్పాలే మల్లమ్మకన్నీరుగా ప్రసిద్ధి. అందుకనే కర్ణాటక రెడ్డిసంఘం వారు శ్రీశైలం ఆలయం వెనుక హేమారెడ్డి మల్లమ్మకు ఆలయాన్ని నిర్మించి శ్రీశైల దేవస్థానానికి దత్తత ఇచ్చారు. ప్రతినిత్యం ఈ ఆలయంలో హేమారెడ్డి మల్లమ్మకు నిత్యపూజాధికాలు జరుగుతున్నాయి. కర్ణాటకకు చెందిన హేమారెడ్డి మల్లమ్మ ఆలయాన్ని ఉగాది ఉత్సవాల సందర్భంగా వేలాది మంది కన్నడ భక్తులు సందర్శిస్తున్నారు.

ఆలయం దినదినాభివృద్ధి

హేమారెడ్డి మల్లమ్మ ఆలయాన్ని దినదినాభివృద్ధి చేస్తున్నారు. దాతల సహకారంతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే ఆలయం వద్ద చెట్టను నాటి పచ్చదనాన్ని పెంపొందించారు. ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద భక్తులు సేద తీరేందుకు చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. హేమారెడ్డి మల్లమ్మను దర్శించుకునేందుకు మహిళలకు, పురుషులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. హేమారెడ్డి మల్లమ్మ ఆలయాన్ని, అమె నివాసం ఉన్న పూరిగుడిసెను పలువురు కన్నడ భక్తులు సందర్శిస్తున్నారు.

తొలిమొక్కు నాగలూటి వీరభద్రస్వామికే

- కన్నడ, మహారాష్ట్రీయులకు ఆరాధ్యదైవం
- భక్తులతో కిటకిటలాడుతున్న నాగలూటి





భక్తులతో కిటకిటలాడుతున్న నాగలూటి క్షేత్రం, భక్తులకు రక్షకుడిగా కొలువుదీరిన శ్రీవీరభద్రస్వామి



వీరభద్రస్వామి ఆలయం

ఆత్మకూరు: కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు లక్షలాదిగా ఉగాది పర్వదినం సందర్భంగా తమ ఆడబిడ్డగా భావించే శ్రీశైల భ్రమరాంబాదేవిని దర్శించుకునేందుకు వందల కిలోమీటర్ల కాలినడన తరలివెళ్లడం అనాదిగా కొనసాగుతోంది. అయితే వారు భ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల దర్శనాని కంటే ముందుగా తమ ఆరాధ్యదైవమైన నాగలూటి వీరభద్రస్వామిని దర్శించుకొని, తొలి మొక్కు సమర్పించి శ్రీగిరికి బయలు దేరడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఉగాది బ్రహ్మోత్సవాలకు వెళ్లే భక్తులు లక్షలాదిగా నల్లమల కొండల్లో వెలసిన నాగలూటికి తరలిరావడంతో ఈ క్షేత్రం గత పదిరోజులుగా కిటకిటలాడుతోంది.

ఆరాధ్యదైవానికే తొలిమొక్కులు :

రాష్ట్రం కాని రాష్ట్రం నుంచి వందల కిలోమీటర్ల దూరం కాలినడకన శివనామస్మరణ చేస్తూ కావడితో, రథాలు, గుర్రాలతో స్వామివారి సన్నిధికి తమ స్వస్థలం నుంచి శ్రీశైలక్షేత్రానికి బయల్దేరుతారు. ప్రతి భక్తుడు నాగలూటి క్షేత్రం చేరుకోగానే దీపారాధాన, ధూపదీపనైవేద్యాన్ని సమర్పిస్తారు. ఇలా సమర్పించి వీరభద్రస్వామి ఆశీస్సులు పొంది మల్లన్న దర్శనం కోసం యాత్ర కొనసాగిస్తారు.

భక్తుల రక్షకుడు

శ్రీశైలమహాక్షేత్రానికి మహాశివరాత్రి , ఉగాది పర్వదినాల సందర్భంగా కాలినడకన వెళ్లే లక్షలాది మంది శివభక్తులకు వీరభద్రస్వామిని దర్శించుకుని క్షేత్రానికి వెళ్లడం జరుగుతుంది .నాగలూటిలో వెలిసిన వీరభద్రస్వామిని కర్నాటక, మహారాష్ట్ర భక్తులే కాకుండా తెలుగు వారు సైతం శరభ, శరభ, భద్ర..భద్ర అంటూ నాగలూటి వీరభద్రస్వామిని ప్రార్థిస్తూ నల్లమల కొండల వెంట శివనామస్మరణతో పాటూ వీరభద్రస్వామిని స్మరించుకుంటూ తొలిపూజ నిర్వహించి వెళ్తారు. వీరభద్రస్వామి లక్షలాది మంది భక్తుల రక్షకుడిగా ఉంటూ నల్లమల అటవీ ప్రాంతంలో వారిని సంరక్షిస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా, కాళ్లకు ఎలాంటి గాయాలు కాకుండా మల్లన్న సన్నిధికి చేర్చుతాడనేది నమ్మకం. అందుకే వీరభద్రస్వామికి తొలి మొక్కు చెల్లించి శ్రీశైలం పయనమవుతారు. కొన్నేళ్ల క్రితం వరకు ఎలాంటి రవాణా మార్గాలు లేనప్పుడు కాలినడకే ప్రధాన మార్గం కావడం వలన ప్రతి ఒక్కరు కాలినడకనే శ్రీశైలక్షేత్రం వెళ్లే వారు ప్రస్తుతం రోడ్డు మార్గం ఏర్పడినప్పటికీ వానాల్లో వెళ్లేవారు సైతం వీరభద్రస్వామిని దర్శించిన తరువాతం ముందుకు సాగుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

మిడుతూరు: అకాల వర్షం, వడగండ్ల వానకు పండు మిరప, మొక్కజొన్న, అరటి, బొప్పాయి సాగుచేసి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం మండలపరిధిలోని జలకనూరు గ్రామంలో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

పగిడ్యాల: ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందించని వార్డెన్ విజయ్‌బాబుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి మద్రిస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్సీ హస్టల్‌ను సందర్శించిన ఆయన పిల్లలకు అందించే భోజనం, చికెన్ వంటకాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక్కొక్క విద్యార్థికి 100 గ్రాముల చొప్పున ప్రభుత్వం ప్రతి ఆదివారం చికెన్‌ను అందిస్తోందని తెలిపారు. అయితే పిల్లలకు ఉడికీ ఉడకని నీళ్ల చారుతో కూడిన చికెన్‌ను తయారు చేసి పెట్టడం వలన చాలా మంది తినలేక అవస్థలు పడుతూ పారబోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నముద్రిపాద్ ఆశయాలు కొనసాగించాలి

ఆత్మకూరు: భారత కమ్యునిస్ట్ ఉద్యమ నిర్మాత నముద్రిపాద్, మహిళా సంఘం నాయకురాలు మల్లూస్వరాజ్యం ఆశయాలు కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, కార్యదర్శివర్గ సభ్యులు రాజశేఖర్, ఏ సురత్నం అన్నారు. పట్టణంలోని ధనుంజమీటింగ్ హాల్‌లో ఆదివారం నముద్రిపాద్, మల్లూస్వరాజ్యంల వర్ధంతి సభను నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రణధీర్, మీనాక్షమ్మ, శివమ్మ, పుల్లమ్మ, అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచితవైద్య శిబిరం

మహానంది: స్థానిక ఈశ్వర్‌నగర్ కాలనీలో ఆదివారం సెవెన్‌హిల్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ క్రాంతికిరణ్, డాక్టర్ శివబాలిరెడ్డి, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిల ఆధ్వర్యంలో ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి అధినేత మారుతీ కుమార్ మాట్లాడుతూ.. విరిగిన ఎముకలకు పేదలకు ఉచిత శస్త్రచికిత్సలు చేస్తామని తెలిపారు. రెడ్‌క్రాస్ ప్రతినిధి అమర్‌నాథ్ పాల్గొన్నారు.

కేసీ కాల్వకు 840 క్యూసెక్కుల నీటి సరఫరా

- సుంకేసుల నుంచి 350 క్యూసెక్కుల నీటి విడుదల
- ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి 490 క్యూసెక్కులు



జూపాడుబంగ్లా వద్ద కేసీ కాల్వలో నీటి ప్రవాహం

జూపాడుబంగ్లా: రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలు ముమ్మరంగా నూర్పిడి జరుగుతున్న నేపథ్యంలో కర్నూలు–కడప కాల్వలో క్రమేణా సాగునీటి సరఫరా తగ్గుతూ వస్తుంది. ప్రస్తుతం కేసీ కాల్వకు 840 క్యూసెక్కుల సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల జలాశయం నుంచి కాల్వకు 350 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి 490 క్యూసెక్కుల నీటిని కేసీ కాల్వకు సరఫరా చేస్తున్నారు. ఈ నీరు లాకిన్స్‌లా వరకు చేరుతున్నాయి.

లాకీన్స్‌లా వద్దకు 700 క్యూసెక్కుల నీరు

పాములపాడు: మండలంలోని శాంతినిలయం గ్రామం సమీపంలోని కేసీ కెనాల్ 120వ కిలో మీటరు లాకీన్స్‌లా వద్దకు 700 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. కాగా లాకీన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్‌ఛానల్‌కు 150 క్యూసెక్కులు, నిప్పులవాగుకు 550 క్యూసెక్కుల నుంచి విడుదల చేస్తున్నట్లు వివరించారు.

మహానంది ఆలయ ఉద్యోగిపై చర్యలకు రంగం సిద్ధం

మహానంది: మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన ఓ భక్తుడి వీడియో తీసిన ఆలయ ఉద్యోగిపై చర్యలకు రంగం సిద్ధం చేశారు. ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వీడియో తీసి సోషల్‌మీడియా వచ్చేలా చేశాడని భావిస్తూ విచారణ నిమిత్తం ఏఈఓ వై.మధును విచారణ అధికారిగా నియమిస్తూ ఆదివారం ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. విచారణ చేపట్టి త్వరలో నివేదికను ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే ఆలయంలో సీసీ కెమెరాలు పరిశీలించి వీడియో తీసిన ఉద్యోగి ఎవరనేది నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.

ఉర్దూ మాధ్యమానికి పెద్దపీట



మాట్లాడుతున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నబీ అహ్మద్

నందికొట్కూరు: రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ మాధ్యమానికి పెద్ద పీట వేసిందని ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ నబీఅహ్మద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మదరసాయే ఆయేషా నిస్వాన్‌లో ఉర్దూ మీడియం 5వ తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉర్దూ మీడియంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. అన్యాక్రాంతమైన వక్ఫ్ బోర్డు ఆస్తులను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని చెప్పారు. ముస్లింల అభివృద్ధి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. ఆస్మా అనే అనాథ బాలికను దత్తత తీసుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ మైనార్టీ సలహాదారుడు డీఎస్ హబీబుల్లా, ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షకూర్, ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నౌమాన్, ఉమ్మడి జిల్లా డీఎండబ్ల్యూ సబిహాబేగం, ఎంఈఓ ఫైజున్నిసాబేగం, మదరసా నిర్వాహకులు సలాంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ధర్మకర్తల మండలి సభ్యుడు మఠం విరూపాక్షయ్యస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ఉగాది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆదివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని కళావేదిక పై శ్రీశైలజగద్గురు సేవా సమితి ట్రస్ట్ వారిచే ప్రవచనం , కన్నడ భక్తి సంగీత విభావరి, సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాలు భక్తులను అలరించాయి. అలాగే ఆలయ పుష్కరిణి వద్ద కర్నూలు జిల్లా కు చెందిన బలరామ చార్య వారిచే శివక్షేత్ర వైభవం పురాణ ప్రవచన కార్యక్రమం, హైదరాబాద్‌కు చెందిన నిహాల్ కొండూరి వారిచే కన్నడ భక్తిసంగీత విభావరి కార్యక్రమం ఏర్పాటు చేశారు. కాగా ఆలయ పుష్కరిణి వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలకు దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి విచ్చేసి ప్రారంభ ప్రసంగం చేశారు. ఆయన కన్నడ భాషలో రచించించిన శివకీర్తనలను నిహాల్ కొండూరు బృందం వారు ఆలాపించారు.

ఎమ్మెల్సీకి ఘన సన్మానం

నంద్యాల(వ్యవసాయం): పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన రామచంద్రారెడ్డిని పీఆర్‌టీయూ నాయకులు కరుణానిధి, కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు ఆదివారం సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల గురించి తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సమస్యలన్నీ శాంతియుతంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా గౌరవాధ్యక్షుడు ఎన్‌వీ భాస్కరరెడ్డి, విజయరావు, హనుమంతు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శిరివెళ్ల: నంద్యాల– ఆళ్లగడ్డ రహదారిపై శిరివెళ్ల మెట్ట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శిరివెళ్లకు చెందిన హెచ్‌ఎస్ రవూఫ్ (53) మృతి చెందాడని ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రవూఫ్ రోడ్డు దాటుతుండంగా నంద్యాల నుంచి ఆళ్లగడ్డ వైపు వెళ్తున్న ఓ గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు ఇస్మాయిల్ ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

రసవత్తరంగా ఎద్దుల బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దేశం తిరుపంరెడ్డి

వెలుగోడు: రోఖియాబీ ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకొని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఆరు పండ్ల లోపు విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దేశం తిరుపంరెడ్డి, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వేల్పుల జయపాల్ ప్రారంభించారు. పోటీల్లో పదకొండు ఎడ్ల జతలు పాల్గొనగా బోరోబుల్స్ చిన్న జత ఎద్దులు విజేతగా నిలువగా మొదటి బహుమతి రూ. 40,000 (దాత: శ్రీ దేశం తిరుపెంరెడ్డి, అంబాల ప్రభాకరరెడ్డి) అందజేశారు. బోరా బుల్స్(పెద్ద జత) రెండవ బహుమతి రూ. 30,000 (నందిరెడ్డి గారి రామిరెడ్డి, నందిరెడ్డి గారి వెంకటేశ్వరమ్మ), రంగాపూరం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి ఎద్దులు మూడో బహుమతి రూ. 20,000 (ముంతల విజయభాస్కరరెడ్డి , బి. శివశంకర్ నాయుడు), జూపాడుబంగ్లాకు చెందిన ఈదుల విష్ణువర్ధన్‌రెడ్డి ఎద్దులకు నాలుగో బహుమతి రూ.15000 (ఎం.ఇలియాస్‌ఖాన్, గోవిందు, రమణ), పుసులూరుకు చెందిన గజ్జల శ్రీనిత్య వృషభాలు ఐదో బహుమతి రూ. 10000 (ఏపీపీ ఆసీఫ్ అలీఖాన్, ఉప సర్పంచ్ ముబీనా), మదాస్‌పల్లెకు చెందిన వెంకట మనోజ్, ప్రొద్దుటూరుకు చెందిన లక్ష్మీనారాయణ ఎద్దులు సంయక్తంగా ఆరో బహుమతి రూ.5000 (మోతుకూరు మాజీ సర్పంచ్ యం. నాగేశ్వరరెడ్డి) అందుకున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అమీర్ అలీ ఖాన్, రామ్మోహన్ రెడ్డి , పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, ఆసిఫ్ అలీఖాన్, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వర్ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోగోలు శివశంకర్‌నాయుడు, ముడిమేల సుధాకర్‌రెడ్డి, వంగాల వెంకటరామిరెడ్డి, తెలుగు రమణ, ఎంపీటీసీలు రాజేష్ , చికెన్‌బాబు, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

‘మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి’

ఆత్మకూరు: దేశంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజశేఖర్, ఏసురత్నం అన్నారు. స్థానిక ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఆదివారం ఆ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా బీజేపీ ప్రభుత్వం నడుచుకుంటోందని, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందని చెప్పారు. కార్యక్రమంలో స్వాములు, సురేంద్ర, సుధాకర్, రణధీర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

23న ఎద్దుల బండలాగుడు పోటీలు

పాణ్యం: ఎస్. కొట్టాల గ్రామంలో ఈనెల 23వ తేదీన ఆరు పండ్లలోపు వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. శ్రీ హజరత్ దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా ఈ పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాల్గొనదలిచిన వృషభాల యజమానులు ముందుగా రూ.400ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే 24వ తేదీన ఉమ్మడి జిల్లా స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలకు సెల్: 9642517339, 6304594451, 9666954464కు సంప్రదించాలన్నారు.

వైభవంగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణానికి ముస్తాబైన ఉత్సవవిగ్రహాలు



కల్యాణానికి హాజరైన భక్తులు

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీగోదాదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వివిధ పూజల అనంతరం ఉత్సవ విగ్రహాలను అలంకరించి పూజలు చేశారు. అనంతరం పండితులు ప్రత్యేక మండపంలో స్వామిఅమ్మవార్లకు వివాహ వేడుకలు చేపట్టారు. వేదమంత్రాల నడుమ, ముత్యాల తలంబ్రాలతో స్వామివారి కల్యాణం రమణీయంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

కన్నడ భక్తులతో మహానంది కిటకిట

మహానంది: మహానంది ఆలయం ఆదివారం భక్తజనంతో కిటకిటలాడింది. సెలవురోజు కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు కన్నడ భక్తులు వేలాది సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక రుద్ర గుండం, బ్రహ్మ, విష్ణుగుండం కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఉదయం నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవార్ల దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. రాతి నందివిగ్రహం, పెద్ద నంది విగ్రహాలను భక్తులు తిలకించారు.

మహానందీశా.. భక్తుల కష్టాలు కనవయ్యా !



టికెట్ల కోసం ఎండలోనే వేచి ఉన్న భక్తులు

మహానంది: ఏడాదికి రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా భక్తులకు కనీస వసతుల కల్పనలో మాత్రం అధికారులు విఫలమవుతున్నారు. రూ.లక్షల్లో ఆదాయం వచ్చే సమయంలో రూ.వేలు వెచ్చించి కాస్త వేసవితాపం నుంచి ఉపశమనం కలిప్పంచేందుకు షామియానాలు ఏర్పాటు చేయకపోవడం బాధాకరం అంటూ మహానందీశ్వరుడి భక్తులు మండిపడుతున్నారు. గంటల పాటు మండుటెండలో వృద్ధులు, చిన్నారుల తల్లిదండ్రులు నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. . ఉగాది ఉత్సవాలు సమీపిస్తుండటంతో మహానంది ఆలయానికి వేలాది సంఖ్యలో కన్నడ భక్తులు తరలివస్తున్నారు. రూ. 50, రూ. 30, రూ. 10 ఆర్జిత సేవాటికెట్ల ద్వారా వారు శ్రీ మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుంటుంటారు. కాగా టికెట్ల కొనుగోలుకు, దర్శనానికి ఎండలోనే నిలబడాల్సి రావడంతో భక్తుల కష్టాలు వర్ణనాతీతం. ఆలయంలోని ముఖమండపం దాటిన తర్వాత పెద్ద కోనేరు వద్ద ఉన్న రూ. 50, రూ. 30 టికెట్ల కొనుగోలు కేంద్రం వద్ద వేచి ఉండాలంటే ఎండలోనే నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ఉగాది ఉత్సవాలు ముగిసేవరకైనా క్యూలైన్ల వెంట భక్తులకు నీడ కల్పించేలా షామియానాలు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయాన్ని సాక్షి ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామని, క్యూలైన్ల వెంట షామియానాలు ఏర్పాటు చేయిస్తామన్నారు.